# రిప్లై

**వే**గంగా దూసుకుపోతోంది బస్. కిటికీ దగ్గర కూర్చున్న శారద దీర్ఘాలోచనలో మునిగి ఉంది. మొహానికి ఎండ తగులుతున్నా లెక్కచెయ్యకుండా కిటికీకి తల ఆనించి కూర్చుని ఉంది.

చూపు వేగంగా దాటిపోతున్న చెట్లమీద ఉన్నా మనసు మాత్రం మరెక్కడో ఉంది. అప్రయత్నంగా హాండ్‌బాగ్ తెరిచి అందులోని ఉత్తరం బయటికి తీసింది. పొద్దున పది గంటలకి ఆయా తెచ్చి అందించిన ఆ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివిందో లెక్కలేదు. అందులోని అక్షరాల వెంట పరుగుతీశాయి కళ్ళు.

"ప్రియమైన శారదా!

"మా నాన్నగారు నా వివాహ ప్రసక్తి తీసుకువచ్చారు. ఆయనకి మన విషయం చెప్పాను. మండిపడ్డారు. నేనెంతో బతిమాలగా శాంతించారు. నీ వివరాలు అడిగారు. చెప్పాను.

"మీ అమ్మ విషయం వచ్చేసరికి ఆయన అనుమానంగా మరోసారి అడిగారు. కాలకూట విషంలాంటి నిజం బయటపెట్టారు. మీ అమ్మ గురించి మా నాన్నగారికి తెలుసుట. నీకు తండ్రి లేడు శారదా! మీ అమ్మకి అసలు పెళ్ళే కాలేదు.

"ఆవిడ ఎక్కడా ఉద్యోగం చెయ్యటంలేదు. ఆవిడ చేసే పని ఏమిటో, నిన్ను ఎలా చదివిస్తోందో నువ్వే ఊహించుకో. ఈ నిజం తెలిసి హతాశుడిని అయిపోయాను.

"నీకు బాగా తెలుసు – మాది పరువు ప్రతిష్ఠలున్న కుటుంబం. కోటీశ్వరులైన మా నాన్నగారిని నువ్వు బీదపిల్లవని చెప్పి ఒప్పించగలను గానీ ఒక వేశ్య కూతురివని

తెలిశాక ఎలా సంభవం చెప్పు! నీకు ఈ విషయం తెలియదో, తెలిసే నా దగ్గర దాచావో నాకు తెలియదు. జరిగింది ఏదో జరిగిపోయింది.

"నువ్వంటే నా కెంతో ఇష్టం. నేను నిన్ను గాఢంగా ప్రేమించాను. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. ఆ విషయమే నాన్నగారితో చెప్పాను. ఆయన ఎంతో ఆలోచించారు. మా అన్నయ్యతో కూడా సంప్రదించారు. చివరికి మే మందరం కలిసి ఒక నిర్ణయానికి వచ్చాము.

"నిన్ను మా ఇంటి కోడలిగా అంగీకరించారు నాన్నగారు. కానీ ఒక షరతు– నువ్వు నీ తల్లితో పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలి. ఆవిడతో ఎటువంటి సంబంధం పెట్టుకోకూడదు. ఆవిడని కలుసుకునేందుకూ, మాట్లాడేందుకూ వీలులేదు. నువ్వు ఎవరో మా బంధువులమ్మాయివనీ, నీ కెవరూ లేరనీ అందరికీ చెప్తాం.

"ఈ షరతుకి నీకు అభ్యంతరం ఉండదని ఆశిస్తాను. వెంటనే నీ నిర్ణయం తెలియజెయ్యి.

నీ

రాజా".

బిగించిన పిడికిలిలో నలిగిపోయింది ఆ ఉత్తరం. కింద పెదవి పంటికింద నలిగి రక్తం చిమ్మింది. అసలే ఎండకి కందిన మొహం మరింత ఎర్రబడింది.

గమ్యం చేరేసరికి రాత్రి ఏడు గంటలు అయింది. జోరీగల్లా ముసురుతున్న రిక్షావాళ్ళని తప్పించుకుంటూ బస్‌స్టాండ్ బయటికి వచ్చింది శారద. కాస్త దూరం నడిచి రిక్షా మాట్లాడుకుని కూర్చుంది.

ఎన్నో ఏళ్ళు దాటిపోయింది ఆ ఊరు వచ్చి. ప్రతిసారీ సెలవులకు ఇంటికి వెళ్దాం అనుకునేసరికి తల్లి దగ్గర్నించి ఉత్తరం వచ్చేది.

"నాకు బోనస్ వచ్చింది. ఎలాగూ నాకు సెలవులేగా ఇద్దరం కలిసి ఫలాని ఊరికి వెళ్దాం. అక్కడ దేవుడి దర్శనం చేసుకుందామని ఎన్నాళ్ళుగానో కోరిక. అన్నీ కలిసివచ్చాయి. నేను ఫలాని రోజుకి నీ దగ్గరికి వస్తాను. ఇద్దరం వెళ్ళొద్దాం" అని రాసేది.

అలాగే సెలవుల్లో ఆ ఊరూ ఈ ఊరూ తిరుగుతూ కాలక్షేపం చేసేవాళ్ళు. అలా కొత్త ప్రదేశాలు తిరగటం తనకూ సరదాగానే ఉండేది. సంతోషంగా సరే అనేది.

అంతేగానీ తల్లి తను ఈ ఊరు రాకుండా ఉండడానికి ప్రయత్నం చేస్తోందనే అనుమానమే రాలేదు.

ఆలోచనల్లో ఉండగానే గమ్యం చేరింది రిక్షా. ఇన్ని సంవత్సరాలలో ఎంత మార్పు ఊరిలో. ఎన్నో కొత్త కట్టడాలు లేచాయి. సందు మొదట్లో రిక్షా దిగి బ్యాగ్ భుజాన తగిలించుకొని నడవడం మొదలు పెట్టింది.

ఇరుగ్గా మురిగ్గా ఉంది ఆ సందు. కోళ్ళగూళ్ళలా ఇళ్ళు. దోమల సంగీతం, చిన్నతనం నుంచి హాస్టల్ వాతావరణానికి అలవాటు పడిన శారదకి ఆ వాతావరణం జుగుప్స కలిగించింది.

మెల్లిగా నడుస్తూ ఇంటికి చేరింది. తలుపు చేరవేసి వుంది. ఒక్క క్షణం తటపటాయించి తలుపు నెట్టి లోపలికి ఒక్క అడుగు వేసింది శారద.

ఆపైన అడుగు ముందుకు పడలేదు. దుమ్ము కొట్టుకుపోయిన బల్బ్ గుడ్డిగా వెలుగుతోంది. చిన్నగది. ఆ గదిలోని అన్ని వస్తువులూ పేదగా, బీదగా ఉన్నాయి. ఆ గదిలోనే ఒక మూల వంట సామానులు ఉన్నాయి.

కంచం ముందు కూర్చుని భోజనం చేస్తున్న ఆ మనిషి ఎవరు... అమ్మా? అమ్మేనా?

కాదు, అమ్మ ఇలా ఇంత పేదగా, ఇంత వయసు పైబడినట్లు ఎందుకుంటుంది?

అలికిడికి తల తిప్పి చూసింది సావిత్రి. చేతిలోని అన్నం ముద్ద జారిపోయింది.

"శారదా నువ్వా ఇదేమిటమ్మా వస్తున్నట్లు ఉత్తరం రాయలేదేం?" ఒక్క ఉదుటున లేచి పరిగెట్టుకు వచ్చి అమాంతం కూతుర్ని కావలించుకుంది.

"ఎన్నాళ్ళయిందే తల్లీ నిన్ను చూసి, బాగున్నావా అమ్మా!" కనులవెంట నీరు కారుతుండగా కూతురి తల నిమిరింది.

ఒక్క క్షణం గడిచేసరికి కూతురు వచ్చిందనే ఆనందం దూరమైపోయింది. దాని స్థానాన భయం చోటు చేసుకుంది. అంతులేని ఆందోళన కలిగింది.

"ఇలా వచ్చేశావేం శారదా? ఉత్తరం రాస్తే నేను వచ్చేదాన్నిగా?"

ఇంటిని పరిశీలించి చూస్తున్న శారద తల్లి ప్రశ్నకి సమాధానం చెప్పలేదు. శారద చూపు ఇల్లంతా పరిశీలించి తల్లి కట్టుకున్న చిరిగిన చీర మీదికి చేరింది.

తడబడిపోయింది సావిత్రి. "నిన్నటి నుంచి కొంచెం ఒంట్లో బాగాలేదు. ఇవ్వాళ ఆఫీసుకి వెళ్ళలేదు. ఇంట్లోనే కదా అని ఈ పాత చీర కట్టుకున్నాను" అనేసింది.

అంతలోనే ఇల్లు అయ్యవారి నట్టిల్లులా ఉందనీ, కూతురికి పెట్టడానికి ఏమీ లేవనీ గుర్తొచ్చింది.

వెంటనే మంచం వాల్చి దుప్పటి పరిచింది.

"నువ్వు కూర్చో తల్లీ. ఒక్క క్షణంలో వస్తా" అంటూనే వెళ్ళిపోయింది.

చెంపకు చెయ్యి చేర్చి మంచం మీద కూర్చుంది శారద. పది నిముషాల్లో తిరిగి వచ్చింది సావిత్రి. ఒక చేతితో కాగితంలో చుట్టిన వేడి వేడి పకోడీలు, మరో చేతిలో గాజుగ్లాసులో కాఫీ.

"ఎప్పుడనగా బయలుదేరావో తీసుకో" అంటూ పక్కనే కూర్చుంది. అంతలోనే లేచి వెళ్ళి పొయ్యి వెలిగించి స్నానానికి నీళ్ళు పెట్టింది.

పకోడీ నోట్లో పెట్టుకుని మరోసారి ఇల్లు కలియజూసిన శారద దృష్టి తల్లి తింటూ సగం వదిలేసిన కంచంమీద పడింది.

పిడికెడు ముతకబియ్యపు అన్నం. ఏదో పచ్చడి. ఎవరో పిడికిలి బిగించి కడుపుమీద గుద్దినట్లు అయింది శారదకి.

నీళ్ళు కాచి కూతుర్ని లేవదీసి స్నానానికి పంపింది. స్నానం చేసి వచ్చేలోపల పరిగెట్టుకు వెళ్ళి క్యారేజీ పట్టుకొచ్చింది.

"ఇప్పటికే బోలెడు ఆలస్యం అయింది. ఇప్పుడు వండాలంటే పొద్దు పోతుందని క్యారేజీ తెప్పించాను. రా" అంటూ అరిటాకు పరిచి క్యారేజీ విప్పి వడ్డించింది.

భోజనం రుచిగానే ఉంది. సావిత్రి కొసరి కొసరి వడ్డించింది. అయినా ముద్ద మింగుడు పడలేదు శారదకి. బలవంతాన నాలుగు మెతుకులు తిని లేచి వెళ్ళిపోయింది.

కూతురు సరిగ్గా అన్నం తిననందుకు విలవిల్లాడింది సావిత్రి. కూతురికి మంచం మీద పక్కవేసి, తను కింద దుప్పటి పరుచుకుని పడుకుంది సావిత్రి.

"ఇంత హఠాత్తుగా వచ్చావేం అమ్మా" అడిగింది.

"మా ఫ్రెండ్స్ అందరం టూర్ వెళ్ళాలనుకున్నాం. నాకు అయిదు వందలు కావాలి. రెండ్రోజుల్లోనే ప్రయాణం. ఉత్తరం రాసి డబ్బు తెప్పించుకునే వ్యవధి లేదని నేనే బయలు దేరాను" అంది శారద.

"అలాగా! తప్పకుండా వెళ్ళమ్మా, రేపొద్దున డబ్బు ఇస్తాను" హామీ ఇచ్చింది సావిత్రి.

కబుర్లు చెప్తూనే నిద్రలోకి జారిపోయింది శారద.

తలుపు శబ్దం అయ్యేసరికి నిద్రాభంగం అయింది శారదకి. చీకట్లోనే కళ్ళు చిట్లించి చూసింది.

సావిత్రి మెల్లిగా వెళ్ళి చప్పుడు కాకుండా తలుపు తీసింది. ఎవరో నిలబడి ఉన్నారు బయట. బయటికి వెళ్ళి తలుపు జారవేసింది సావిత్రి.

వెంటనే మంచంమీద నుంచి లేచి పిల్లిలా కిటికీ దగ్గర జేరింది శారద.

"ఎందుకు, సావిత్రీ, అర్జెంటుగా రమ్మని కబురుపెట్టావు?" అడిగాడతను.

"పని పడింది రావుడూ! అర్జెంటుగా అయిదొందలు కావాలి. నాయుడుగారి దగ్గరకి వెళ్ళి తీసుకురావాలి" చెప్పింది సావిత్రి.

"ఇప్పటికిప్పుడు అంత డబ్బెందుకు సావిత్రీ!" అడిగాడు రావుడు.

"అమ్మాయి వచ్చింది రావుడూ, స్నేహితులతో ఎక్కడికో ఊరు వెళ్తుందిట. డబ్బు కావాలిట. వెంటనే వెళ్ళి తీసుకురా" చెప్పింది సావిత్రి.

తలూపి వెనక్కి తిరిగాడు రావుడు. "మాట" పిల్చింది సావిత్రి.

"మరో రెండొందలు ఇవ్వగలిగితే ఇమ్మని చెప్పు. అమ్మాయికి ఇస్తాను. చీరలు కొనుక్కుంటుంది" అని చెప్పింది.

"నువ్వు అడిగితే ఆయన ఎప్పుడైనా ఇవ్వనన్నాడా? ఆయన ఇస్తానన్నా నువ్వే చాలు చాలని గోల పెడతావు".

"నువ్వు వెర్రిమాలోకానివి కాబట్టి ఇలా ఉన్నావు గానీ మరొకరైతే లక్షలు రాబట్టుకునేవారు" అన్నాడు రావుడు.

"లక్షలు, కోట్లు నేనేం చేసుకుంటాను రావుడూ? ఈ ఏడాదితో అమ్మాయి చదువైపోతుంది. నా బాధ్యత తీరిపోతుంది. ఇక ఆ తరువాత అమ్మాయికి దూరంగా ఏ పుణ్యక్షేత్రానికో వెళ్ళిపోతాను. ఏ గుడి ముందు కూర్చున్నా ఇంత ముద్ద దొరకకపోదు. నా జీవితం వెళ్ళమారిపోతుంది".

"ఏమిటో మరీ బొత్తిగా సత్యకాలం మనిషివి" అన్నాడు రాములు జాలిగా.

"సర్లే ఈ కబుర్లకేం గానీ, నువ్వు వెళ్ళి డబ్బు తీసుకుని త్వరగా రా. తెల్లవారి ఫస్ట్ బస్‌కే శారదని పంపించేస్తాను" అని చెప్పి పంపించింది సావిత్రి.

లోపలి కొచ్చి తలుపు మూసేసి నిశ్శబ్దంగా పక్క దగ్గరికి వెళ్ళింది. మరుక్షణం గదిలో లైట్ వెలిగింది.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది. సావిత్రి ఎదురుగా నిలబడి ఉన్న శారదని చూసి అదిరిపడింది. గడగడా వణికిపోయింది. ఏదో చెప్పాలని ప్రయత్నించి తడబడి పోయింది.

తల్లి దగ్గరకు వచ్చింది శారద. "అమ్మా" అంటూ చేతులు చాచింది.

ఆ చేతుల్లో ఒదిగిపోయి బావురుమంది సావిత్రి. "శారదా! నేను... నాకు..." ఏదో చెప్పబోయింది.

ఆదరంగా తల్లి తల నిమిరింది శారద. "ఇంకేం చెప్పకమ్మా నాకు అంతా తెలిసిపోయింది" అంది.

కాసేపటికి కొంచెం తెప్పరిల్లింది సావిత్రి.

తల్లిని మంచం మీద కూర్చోబెట్టింది శారద. "అమ్మా నా కో చిన్న పనుంది. ఇప్పుడే అది పూర్తి చేసి వస్తాను" అనేసి బ్యాగ్‌లోంచి తెల్ల కాగితాలు, కలం తీసుకుని గదిలో మూలకి వెళ్ళి కూర్చుంది.

"రాజా,

"నీ ఉత్తరం అందింది. అసాంతం చదివాను. ఒకసారి కాదు. చాలాసార్లు చదివాను. నువ్వు చెప్పింది అర్థం చేసుకున్నాను.

"నిజమే. మా అమ్మ గురించి ఇన్నాళ్ళూ నాకు తెలియదు. నీ ఉత్తరం చూశాక నిజం ఏమిటో తెలుసుకుందామని వెంటనే మా అమ్మ దగ్గరికి వచ్చాను. నిజం తెలుసుకున్నాను. తెలిశాక ఎంతో సిగ్గుపడుతున్నాను.

"ఆవిడ కూతురినై ఉండి ఇంతకాలం ఆవిడ గురించి ఏమీ తెలుసుకోకుండా ఉండిపోయినందుకు సిగ్గుపడుతున్నాను.

"మా అమ్మ గతం ఏమిటో తెలియదు. ఏ దౌర్భాగ్యుడు పెళ్ళి పేరు చెప్పి వంచించాడో నాకు తెలియదు. తెలుసుకోవలసిన అవసరం కూడా నాకు లేదు.

"నా చిన్నతనం నుంచి తనకు దూరంగా హాస్టల్లో నన్ను ఉంచి చదివించింది అమ్మ. నాకు సకల సౌకర్యాలు కలిగించింది. నన్ను డాక్టర్ని చేసింది.

"నన్ను అందలం ఎక్కించిన మా అమ్మ ఇక్కడ కటిక దరిద్రం అనుభవిస్తోంది. లక్షలు సంపాదించే అవకాశం ఉండి కూడా మామూలు జీవితం గడిపేస్తోంది.

"మనిద్దరికీ పరిచయం అయి అయిదేళ్ళు పూర్తి అయింది. మనిద్దరికీ ఒకరిపట్ల మరొకరికి అనురాగం ఉంది. అన్నీ అనుకూలిస్తే జీవితం అంతా కలిసి బతుకుదాం అనీ కూడా అనుకున్నాం.

"నీ ఉత్తరంలో నువ్వు మీ నాన్నగారితో మాట్లాడాననీ, ఆయనని ఒప్పించాననీ తెలియజేసి మన పెళ్ళికి మీరు నిర్ణయించిన షరతు కూడా నాకు తెలియజేశావు.

"పరిస్థితి ఇంతదాకా రానే వచ్చింది కాబట్టి, నువ్వు, మీ నాన్న మా అమ్మ గురించి చాలా కఠోరసత్యాలు సేకరించారు కాబట్టి, నా ధర్మంగా నేనూ మీ గురించిన వివరాలు సేకరించాను.

"మీది పరువు ప్రతిష్ఠలు గల కుటుంబం అని తెలియజేశావు. కానీ, మీది కేవలం డబ్బున్న కుటుంబం. మీ నాన్నగారి గురించిన కథలూ, గాథలూ చాలా ప్రచారంలో ఉన్నాయి. ఆయన అపర గోపాలకృష్ణుడనీ, వారి గోపికలు చుట్టుపక్కల చాలామంది ఉన్నారనీ అందరికీ తెలుసు.

"ఇక మీ అమ్మ ఆగర్భ శ్రీమంతుడి అనుంగు ఇల్లాలు. కుప్ప తెప్పలుగా డబ్బున్నా ఆవిడకున్న కాపీనం ఇంతా అంతా కాదుట. మీ పనిమనిషి రాములమ్మ మొగుడు లారీ కింద పడి చావుబతుకుల్లో ఉండి సాయం అడిగితే దాని మెడలో మంగళసూత్రం తాకట్టుపెట్టుకుని వంద రూపాయలు అరువిచ్చిందిట కదూ ఆ మహాసాధ్వి?

"మరి అలాంటి తల్లిదండ్రుల కొడుకువై ఉండి నువ్వే అంత గర్వంగా కాలరు ఎగరేసుకుని తిరుగుతూ ఉంటే, మా అమ్మలాంటి దేవత కడుపున పుట్టిన నేను ఇంకెంత గర్వపడాలి చెప్పు?

"పెళ్ళి విషయంలో నువ్వు పెట్టిన షరతు నాకు ససేమిరా ఇష్టం లేదు. మా అమ్మతో తెగతెంపులు చేసుకుని నిన్ను పెళ్ళి చేసుకోవలసిన అగత్యం నాకు లేదు.

"మా అమ్మ ఉనికి దాచిపెట్టను నేను. పైగా లోకానికి కంతటికీ చాటి చెప్తాను. నా కోసం మా అమ్మ ఎంత శ్రమపడిందో గర్వంగా చెప్పుకుంటాను.

"ప్రస్తుతానికి పెళ్ళి వాయిదా వేస్తున్నాను. చదువు అయిపోగానే ఉద్యోగం చూసుకుంటాను, అమ్మను నా దగ్గరకు తీసుకొస్తాను. ఇంతకాలం ఆవిడ నన్నెలా సుఖపెట్టిందో అలా నేను ఆవిడని సుఖపెడతాను. ఆ తరువాత పెళ్ళి చేసుకుంటాను.

"నీ లాంటి కోటీశ్వరుడి కొడుకుని కాదు – మా అమ్మలాంటి మంచి అమ్మకు పుట్టిన కొడుకుని ఎంచి పెళ్ళి చేసుకుంటాను.

గుడ్ బై
సావిత్రమ్మగారి అమ్మాయి
శారద"

*ఆంధ్రప్రభ వారపత్రిక, 24 ఆగస్టు, 1988*